

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 205 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 25, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మనీ సంపాదన.. మహా మోసం !









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

మోసాలు చేస్తూ మనీ సంపాదిస్తున్నారు

పాపాలు చేస్తూ పార్టీలు మారుతున్నారు

అవినీతి సొమ్ము వాసన లేకుండా బతకలేకపోతున్నారు

మోసాలకు మరుగుతున్న మనీ సంపాదకులతో జాగ్రత్త

పైసలిస్తేనే పనులు లేదంటే తిరస్కరణలు

రాజకీయాల్లో మోసపూరిత విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి

రాజకీయ పార్టీలు మారుతున్నోలందరూ పచ్చి మోసగాళ్లు

అవినీతిలో పోటీపడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

అక్రమ సంపాదన పోటీపడుతున్న ప్రజా ప్రతినిధులు

అబద్ధాలు ఆడడంలో ఒకరిని మించి మరొకరు తయారవుతున్నారు

మనీ సంపాదనకు మరిగిన సన్నాసులంతా దగుల్బాజీ గాళ్లే

దేశంలో కోట్ల సంఖ్యలో పెరిగిపోతున్న ఆదాయానికి మించిన ఆస్తి దారులు

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

మందిని ముంచి బతకటోళ్ళకు మంచి పేరు సంపాదిస్తున్న వాళ్లలాగా దర్జాగా బతుకుతున్నారని డాక్టర్ బరిగెల శివ అవహేళన చేశారు.పట్టపగలే పగటి వేష దారులరూపంలో వ్యవస్థలను దోచుకు తింటున్న వైనం ఒకవైపు ఉంటుండగా ఏం చేసైనా మనీ సంపాదించాలి అనే విలువ తక్కువ ధోరణితో ఉంటున్న రాజకీయాలను దగ్గరగా చూస్తున్నామని గుర్తు చేశారు.రోజంతా పనిచేసే కార్మికుడు పట్టుమని 1000 రూపాయలు సంపాదించుకోలేని పరిస్థితిలో ఉంటే ఒక్కరోజులో కోట్ల రూపాయల సంపాదన ఎలా సాధ్యమవుతుందంటూ నిలదీశారు.నిలువు దోపిడి పేరుమీద జీవిస్తున్న మనీ సంపాదకులు అంతా మహా మోసగాళ్లేనని వివరించారు.మనీ సంపాదన మోసాలు ఎంతటి స్థాయికి దిగజారిపోయాయో అయోధ్య రామ మందిరంలో దేవుని సొమ్మును అవినీతికి పాల్పడిన వ్యక్తులను చూస్తే దేశం ఏ విధమైనటువంటి అవినీతిలో కూరుకుపోతుందో అర్థమవుతుందన్నారు.సాక్షాత్తు భగవత్ స్వరూపుని ముందు ఉన్నటువంటి అయోధ్య రామ మందిరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అయోధ్య రామ మందిరంలో పవిత్ర విగ్రహాన్ని సురక్షితంగా ఉంచడానికి దేశ ప్రధాని మోడీ నియమించిన వ్యక్తులు

- మిగతా 2లో..




## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత

2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్

2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలపై విచారణ

కేసుల కొట్టివేతతో రేవంత్‌కు ముగిసిన న్యాయపరమైన చిక్కులు

2



## హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్‌లో చెరువు కబ్జా యత్నం భగ్నం

కబ్జాలపై ఉక్కుపాదం మోపిన హైడ్రా ఏజెన్సీ

అక్రమ కట్టడాలు కూల్చివేసి ఫెన్సింగ్ ఏర్పాటు

రెండేళ్లలో లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడిన హైడ్రా



2

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం

జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం

సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

7





## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం

ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం

మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem

# ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

**బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే**
**ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం**
**ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం**
**మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల**

**ఖమ్మం,జూన్24(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

**ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత**
**2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి**
**ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్**
**2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులు**
**ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలపై విచారణ**
**కేసుల కొట్టివేతతో రేవంత్‌కు ముగిసిన న్యాయపరమైన చిక్కులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.

# హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ శివార్లలోని ఐటీ కారిడార్‌లో భారీ కబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) భగ్నం చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో దాదాపు రూ.1,000 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. ఈ స్థలంలో నిర్మించిన తాత్కాలిక షెడ్లు, గదిని కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ విలువైన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేస్తుండగా రెవెన్యూ శాఖ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, అక్రమ నిర్మాణాలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసింది. మరోవైపు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువు కబ్జాను కూడా హైడ్రా అడ్డుకుంది. పట్టా భూమిలో ఆర్ఎంసీ యూనిట్ ఏర్పాటు చేసిన ఓ వ్యక్తి, వ్యర్థాలను చెరువులోకి డంప్ చేస్తూ సుమారు ఐదెకరాల చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు దర్యాప్తు చేసి, చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్) పరిధిలో కార్మికుల కోసం నిర్మించిన షెడ్లను తొలగించారు. చెరువులోకి వేసిన మట్టిని వెంటనే తొలగించాలని కబ్జాదారుడిని హైడ్రా ఆదేశించింది. కాగా, గత రెండేళ్లలో హైడ్రా ఏజెన్సీ రూ.1.10 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ చెరువులు, నాలాలు, పార్కులు, భూములను కబ్జాల నుంచి కాపాడినట్లు ఈ నెల ప్రారంభంలో వెల్లడించింది. వచ్చే ఏడాది నాటికి రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తుల పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

# మనీ సంపాదన మహా మోసం

మొదటి పేజీ తరువాయి

చేసిన అవమానకరమైన దోపిడీకి ఎవరు బాధ్యత వహిస్తారు లేదో తెలియదు గాని ఆ వ్యక్తులందరూ దేశంలో ఉన్న భక్తుల నమ్మకాన్ని వమ్ముచేసి బహిరంగ దోపిడీకి పాల్పడ్డారని తెలిసినప్పటికీ వారిపై తక్షణమైన చర్యలకు ఆదేశించి కఠినంగా శిక్షించాల్సిన ప్రభుత్వాలు దేవాలయ శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వ పెద్దలు నామమాత్రంగా కూడా చర్యలు తీసుకోకపోవడం మనీ సంపాదనలో అతిపెద్ద భయంకరమైన మోసమని దీన్ని బట్టి చూస్తే మనీ సంపాదన అనేది దైవభక్తితో గాని దైవ సేవతో గాని ఏ విధమైన సంబంధం లేదనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు.దేవుని ఆలయానికి కొరకు దేవుని పరిచర్య కొరకు స్వతహాగా డబ్బులు చెల్లిస్తూ దైవ భక్తిని చాటుకునే నేటి రోజుల్లో ఇలాంటి అవినీతి దుర్ఘటనలు జరగడం యావత్ భారత దేశ మానవాళికి అవమానకరమన్నారు.ఒక అయోధ్య రామ మందిరంలోనే ఇలాంటి అవినీతి జరగడం అనేది కాకుండా ఇతర మతాల్లో కూడా అదే రకమైన అవినీతి జరుగుతుందని ప్రతి చోట అన్ని మతాలకు సంబంధించిన మందిరాల్లో జరుగుతున్న అవినీతి పట్ల కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయని వివరించారు.అవినీతి అనేది దేవాలయాలను కూడా వదిలిపెట్టడం లేదంటే ప్రభుత్వ కార్యాలయాలు రాజకీయాల ఆగడాలు ఏ స్థాయిలో దోచుకోబడుతున్నాయో ఆలోచిస్తేనే భయమేసే విధంగా ఉందన్నారు.

**రహస్య సంపాదన రాజ్యమేలుతుంది..**

140 కోట్ల మంది ప్రజలకు దేశంలో ఏ పని జరగాలన్న ప్రతి పనికి సంబంధించిన ఆధారాలు తప్పనిసరి ఉండాల్సిందేనంటూ గుర్తు చేశారు ఆధార్ కార్డు లేకపోతే ఏ పని జరగడం లేదని స్పష్టంగా తేలిపోతుండగా పాస్పోర్ట్ కోసం ఓటర్ ఐడి తప్పనిసరి అని,బ్యాంకుల డిపాజిట్ కు పాన్ కార్డు కావాలని సిమ్ కార్డుకు ఆధార్ కార్డు తప్పనిసరి అని ప్రతిదానికి టాక్స్ రూల్స్ ఆడిడ్స్ ఉంటుండగా,ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వీటన్నిటిని కాదని రహస్యంగా సంపాదిస్తున్న సొమ్మంత ఎక్కడ దాచుకుంటున్నారో పసిగట్ట లేకుండా పోతున్నామన్నారు.మనీ సంపాదకులు మనుషుల విలువ తెలవకుండా బ్రతుకుతుండడం భరించరాని నేరం అన్నారు.ఉద్యోగంలో సంపాదిస్తున్న సొమ్ము ఎంతో చిన్నదైనా అవినీతితో సంపాదిస్తున్న సొమ్ము లెక్కలు తేల్చలేనివని తెలిపారు.మనీ సంపాదకులు ఆధారాలతో కూడిన సంపాదనను మాత్రమే అందరికీ తెలిసేలా చేస్తున్నారని రహస్యంగా సంపాదించుకున్న సొమ్ము కుటుంబ సభ్యులకు కూడా తెలియనంత సీక్రెట్ గా దాచుకుంటున్నారని గుర్తు చేశారు.పోటీపడి సంపాదించుకుంటున్న సొమ్ములో అవినీతి లెక్కలు పంచుకుంటున్న వ్యక్తుల మధ్య విపరీతమైన వైరుధ్యాలు ఏర్పడుతున్నాయని దేశం మొత్తంగా ఎక్కడ చూసినా అవినీతి సంపాదనే రాజ్యమేలుతుందన్నది వాస్తవమన్నారు.పరిస్థితులు అనుకూలించిన పరిస్థితిలు అనుకూలించకపోయిన డబ్బు సంపాదించుకోవాలని దుర్బుద్ధి ప్రతి ఒక్కరిలో ఉంటుందని అలాంటిది అవసరాల కోసం,బ్రతకడం కోసం,కుటుంబాల పోషణ కోసం ఎంతగానో శ్రమ పడుతూ ఎంతగానో కష్టపడుతూ ఎంతగానో ప్రయాస పడుతూ జీవనాన్ని కొనసాగించే కుటుంబాలు 120 కోట్లకు పైన ఉన్నారని కేవలం ధనం కోసం సంపద కోసం పాకులాడే వాళ్ళు తక్కువ సంఖ్యలో ఉంటారని తెలిపారు.దేశ వ్యాప్తంగా ఇంచుమించు ఏడు కోట్ల ఉద్యోగులు అన్ని శాఖలలో పనిచేస్తుండగా ఎన్ని వేల కోట్ల రూపాయలు జీతాలు చెల్లించబడుతున్నాయో ఎన్ని లక్షల కోట్ల రూపాయలు దారి మళ్లించబడుతున్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు.అధికారికంగా సంపాదిస్తే విలువ ఉండడం లేదని భావిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అక్రమ మార్గాల్లో అవినీతి మార్గాల్లో దోచుకునే ఉద్యోగులు 95 శాతానికి పెరిగారని దేశ ప్రజలు చీదరించుకునే పరిస్థితులు లేవనెత్తబడ్డాయన్నారు.ఏ ఉద్యోగి దగ్గర చూసిన లెక్కకు మించిన కోట్ల ఆస్తులు ఎక్కడినుండి వస్తున్నాయంటూ సూటిగా అడిగారు.మరోవైపు మనస్ఫూర్తిగా దోచుకోవడం కోసం రాజకీయాల ప్రభావం తోడ్పాటు అందిస్తుండగా రాజకీయ పదవులు మనీ సంపాదకులకు ఎంత చక్కగా దోహదపడుతున్నాయో దేశంలో నేటి రాజకీయాలను చూస్తుంటే స్పష్టంగా తెలిసిపోతుందన్నారు.ఒకప్పుడు రాజకీయ నాయకుల సంపాదన ప్రభుత్వ అధికారుల దగ్గర బేరిజులాడే విధంగా ఉండేదని ప్రస్తుతం ప్రభుత్వ అధికారుల సంపాదన రాజకీయ నాయకుల దగ్గర తాకట్టు పడిపోయిందని అటు ఇటు గమనిస్తుండగా అటు ఉద్యోగులైన రాజకీయ నాయకులైన కలిసికట్టుగా దోచుకునే మార్గాలను ఎంచుకుంటున్నారని రహస్యంగా దోచుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని గమని స్తున్న ఉద్యోగులు వాళ్ళు దోచుకుంటున్న విధానంపై రాజకీయ నాయకులు గమ్మునుంటుండగా రాజకీయ నాయకులు దోచుకుంటున్న విధానంపై ప్రభుత్వ అధికారులు నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారని ఏది ఏమైనా దోచుకోవడం ఆగకపోవడం గమనిస్తుండగా రహస్యంగా సంపాదించుకుంటున్నది ప్రజల సొమ్మేనన్న సంగతిని ఇటు ప్రభుత్వ అధికారులు అటు రాజకీయ నాయకులు గమనించకపోవడం విడ్డూరం అన్నారు.

**అక్రమ సంపాదనకు చట్టబద్ధత..**

దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అధికారులు అక్రమ సంపాదనకు మరిగి అవినీతి సంపాదనకు మరిగి అవినీతి నిరోధక శాఖ అధికారులచే పట్టుబడుతున్నప్పటికీ మరిన్ని ప్రభుత్వ శాఖలైన ఈడి,ఏసీబీ,సిబిఐ,సిట్,లాంటి ప్రభుత్వ ప్రధాన సంస్థలు అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులపై అనేకమంది రాజకీయ నాయకులపై అనేకమంది పారిశ్రామికవేత్తలపై,అనేకమంది కరుడుగట్టిన వ్యాపారస్తులపై దాడులు నిర్వహిస్తూ వేల కోట్ల రూపాయలు లక్షల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని బహిరంగ లేఖల ద్వారా తెలియజేస్తున్నప్పటికిని రికవరీ చేస్తున్న సొమ్మంతా న్యాయస్థానాలలో పొందుపరచాల్సి ఉంటుండగా ఇప్పటివరకు ఎన్ని లక్షల కోట్ల రూపాయలను పైన తెలుపబడిన శాఖల ద్వారా పట్టుకున్నారో ఎక్కడ ఎలాంటి ఆధారాలు బయటపడటం లేదని వీటన్నిటిని గమనిస్తూ ఉండగా అవినీతిలో కూరుకుపోతూ పట్టుబడుతున్న ప్రతి ఒక్కరూ పార్టీలు మారిపోతున్నారని,ప్రభుత్వ అధికారులైతే రాజకీయ నాయకుల చుట్టూ మనీ పట్టుకొని తిరుగుతున్నారని ఏది ఏమైనా అవినీతి చేసినవాడు వాడు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందుకోవడానికి సునాయసమైన మార్గాలను ఎంచుకుంటూ రాజకీయనాయకుల సహకారంతో అధికార పదవిలో సంపాదిస్తున్న మనీ సహకారంతో సులభంగా బయటపడుతున్నారని ఈ విధంగా రహస్యంగా సంపాదించుకున్న సొమ్ము ఎక్కడికి పోదని బలంగా విశ్వసిస్తున్న వాళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు.మనీ సంపాదకులు మనుషులను మోసం చేసిన ప్రభుత్వాలను మోసం చేసిన భగవంతులను మోసం చేసిన మనస్సాక్షిలో దొరికిపోతున్నారని వాళ్ళ నిజస్వరూపం వాళ్ళ మనస్సాక్షి బయటపెడుతుందని హెచ్చరించారు.రోజురోజుకు అవినీతిపై పెరిగిపోతున్న దాడులతో భయపడాల్సిన మనీ సంపాదకులు అవినీతినే భయపెట్టే విధంగా దోచుకుంటున్నారని అలాంటి వాళ్ల భరతం పట్టడానికి దేశ యువత సంసిద్ధులుగా దూసుకు వస్తున్నారని మనీ సంపాదనలో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులనైన అధికారులనైనా రాజకీయ నాయకులైన కాలం వదిలిపెట్టదని కచ్చితంగా శిక్షించి తీరుతుందని తెలుపుతూనే దేశ యువత చేతిలో అవినీతిపరులు ఆగమవ్వడం ఖాయమని స్పష్టం చేశారు.వేగంగా మారుతున్న మార్పులతో దేశంలోని అవినీతి పునాదులను అవినీతిపరుల జాతకాలను పసిగడుతున్న కాలం వాటిని ఎప్పటికప్పుడు కక్కిస్తూనే ఉందని గుర్తు చేశారు.

# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

**కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు**
**కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం**
**జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం**
**సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**ఖమ్మం,జూన్24(జై భీమ్ న్యూస్) :**

రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగున్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌ఫోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.






# భద్రత తగ్గించి భయపెట్టిస్తారా

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నరనరాల్లో ప్రవహిస్తున్నది ధైర్య సాహసాలు మాత్రమే**
**భయంకరమైన ప్రమాదాలను ఎదుర్కొని నిలబడ్డ సాహసవంతమైన గుండె ఆయనది**
**రాజకీయ పార్టీలు ఇలాంటి చీప్ ట్రిక్స్ తప్ప చేసేదేముంటుంది**
**రౌడీ వేషాలు వేసే రాజకీయ నాయకులకు అంగరక్షకులను కేటాయిస్తున్నారు**
**ఆర్ఎస్పి అంటే ఎవరికి అందనంత శక్తి**
**ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రత కొనసాగించాలి**
**భద్రత తొలగించే ప్రయత్నాలు ఆందోళనకరం: స్వేరో స్టూడెంట్ యూనియన్**



**హైదరాబాద్, జూన్ 24 (జై భీమ్ న్యూస్):**

భారతదేశ వ్యాప్తంగా స్వేరో యుగాన్ని స్థాపించిన అద్వితీయమైన వ్యక్తి మహోన్నత శక్తి బిఆర్ఎస్ పార్టీ ప్రధాన నాయకుడు మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటూ ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి మేధావులు గళం విప్పారు.బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ముందు నిరసన తెలుపుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకమైన నినాదాల నిచ్చారు..ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లాంటి మాజీ ఐపీఎస్ అధికారికి భద్రత సిబ్బందిని తగ్గించే స్థాయికి ఆర్ఎస్పీ ప్రభావం చేరిపోయిందంటే ఒక మాజీ ఐపీఎస్ అధికారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతలా భయపెట్టడాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా చూస్తున్నామని విద్యార్థులు స్పష్టంగా తెలిపారు.ప్రతిరోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశ రాష్ట్ర ప్రజల పట్ల అవలంబిస్తున్న రాజకీయ వ్యతిరేక విధానాలపై ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై స్పష్టమైన నిర్దిష్టమైన ఆధారాలతో కూడిన అవగాహనతో ప్రభుత్వాల ఆగడాలను ఎండగడుతున్న మాజీ ఐపీఎస్ పై ఇంతటి కుట్రలు చేస్తుండడం ప్రభుత్వాల పిరిగితనమని విద్యార్థులు హెచ్చరించారు.అదే సందర్భంలో ఎన్నో అవినీతి ఎన్నో అక్రమాలకు పాల్పడిన రాజకీయ నాయకులకు లెక్కకు మించిన అంగరక్షకులు ఉంటుండగా దేశ రక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా విధులు నిర్వహించిన దళిత సామాజిక వర్గానికి చెందిన ఉన్నతమైన మాజీ పోలీస్ అధికారికి అంగరక్షకులను తగ్గించి బెదిరింపులకు పాల్పడాలని భావిస్తున్న ప్రభుత్వాలకు మాజీ ఐపీఎస్ పోరాటంతో భయం పుంజుకున్నదని గుర్తు చేశారు.ప్రభుత్వాలు భద్రత తగ్గించినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర ప్రజలు దేశ ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా కులమతాలకు అతీతంగా ఆర్ఎస్పి లాంటి మహోన్నత శక్తికి అండగా నిలుస్తాయన్న సంగతిని మర్చిపోకూడదన్నారు.ఒక మహా సంద్రం లాంటి స్వేరో యుగాన్ని సృష్టించుకున్న మాజీ ఐపీఎస్ ఆర్ఎస్పి ఇలాంటి పనికిమాలిన చీఫ్ ట్రిక్స్ కు బెదరడన్న సంగతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని హెచ్చరించారు.వాళ్లు స్పందిస్తూ మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని కొనసాగించాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిపాక నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు రుద్రవరం సునీల్‌తో కలిసి బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దాదాపు 26 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేశారు. గతంలో ఆయనకు ఉన్న భద్రతా ముప్పును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు బుల్లెట్‌ప్రూఫ్ వాహనం, భద్రతా సిబ్బందిని కేటాయించాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ భద్రతా ఏర్పాట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నందునే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ భద్రతా సిబ్బందిని తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా బహుజన సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భూషిపాక గణేష్, ఏరోళ్ల రామచంద్రం, కుమార్ షాను, లింగాల అనిల్‌రాజ్, ఈసంపల్లి రాజు, దాసు, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్, కరుణాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిటీ లాజిస్టిక్ ప్లాన్ అమలుపై జిల్లా స్థాయి సమీక్ష

**నగర సరుకు రవాణా వ్యవస్థ బలోపేతానికి చర్యలు**



**వరంగల్, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**


నగరంలో సరుకు రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రూపొందిస్తున్న సిటీ లాజిస్టిక్ ప్లాన్ (సీఎల్పీ) అమలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పరిధిలో సరుకు రవాణాకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యలు, గిడ్డంగులు, మార్కెట్లు, లాజిస్టిక్ అవసరాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సిటీ లాజిస్టిక్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సమాచారం, గణాంకాలు, క్షేత్రస్థాయి వివరాలను సంబంధిత శాఖలు సమన్వయంతో అందించాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమగ్ర సహకారం ఉంటేనే ప్రణాళిక సమర్థవంతంగా అమలవుతుందని తెలిపారు. నగరాభివృద్ధి, వ్యాపార కార్యకలాపాల విస్తరణ, సరుకు రవాణా ఖర్చుల తగ్గింపు, రవాణా సామర్థ్య పెంపు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ వంటి అంశాలకు సిటీ లాజిస్టిక్ ప్లాన్ దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగర లాజిస్టిక్ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయలక్ష్మి, జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ (సీ అండ్ ఈపీ) హైదరాబాద్ సుధీన్ పాల్, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి చంద్రకళతో పాటు రెవెన్యూ, రవాణా, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, పౌర సరఫరాలు, పరిశ్రమల శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో 'నాగబంధం' మూవీ ప్రమోషన్స్ ఘనం

**తెలుగు సినీ పరిశ్రమలో మరో భారీ విజువల్ వండర్‌గా 'నాగబంధం'**
**జూలై 3న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన విరాట్ కర్ణ -- నభా నటేష్ జంట**

**బొల్లికుంట, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం "నాగబంధం" ప్రమోషనల్ కార్యక్రమం హనుమకొండ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిత్ర బృందం పాల్గొన్న ఈ కార్యక్రమం విద్యార్థులు, యువత, సినీ అభిమానులతో కళకళలాడింది. సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన విశేషాలను చిత్ర యూనిట్ ఈ సందర్భంగా పంచుకుంది. యువ హీరో విరాట్ కర్ణ కథానాయకుడిగా, అందాల తార నభా నటేష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాతలు కిషోర్, నిషిత సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాంకేతిక ప్రమాణాలు, విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండ్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ పరంగా ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమలో కొత్త మైలురాయిగా నిలవబోతోందని చిత్ర యూనిట్ పేర్కొంది. పౌరాణిక అంశాలకు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ రూపొందించిన "నాగబంధం" చిత్రం నాగరహస్యాలు, పురాతన సంపదల అన్వేషణ, ఉత్కంఠభరిత సాహస యాత్రలు, అనేక మిస్టరీలతో కూడిన కథాంశంతో తెరకెక్కుతోంది. భారతీయ పురాణాల్లోని కొన్ని ఆసక్తికరమైన అంశాలను ఆధారంగా తీసుకుని రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. ముఖ్యంగా యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కథ, కథనం, యాక్షన్, విజువల్ గ్రాండియర్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, మోషన్ పోస్టర్లు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియా వేదికల్లో వైరల్ అవుతున్నాయి. దీంతో సినిమా విడుదలకు ముందే భారీ హైప్ ఏర్పడింది. ముఖ్యంగా హీరో విరాట్ కర్ణ పోషిస్తున్న పాత్ర ఆయన సినీ జీవితంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా నిలవనుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా నభా నటేష్ పాత్ర కూడా కథలో కీలక మలుపులకు కారణమవుతుందని, ఆమె పాత్ర చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రమోషనల్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్ర బృందంతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశం లభించడంతో యువత ఆనందం వ్యక్తం చేసింది. సినిమా నిర్మాణానికి సంబంధించిన విశేషాలు, చిత్రీకరణ సమయంలో ఎదురైన అనుభవాలు, విజువల్ ఎఫెక్ట్స్ కోసం తీసుకున్న ప్రత్యేక చర్యలు, పాత్రల రూపకల్పన వంటి అంశాలను చిత్ర యూనిట్ సభ్యులు విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో అభిమానులతో ఫోటోలు దిగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో ఫాంటసీ, అడ్వెంచర్ జానర్‌కు కొత్త నిర్వచనం ఇచ్చే చిత్రంగా రూపొందుతున్న "నాగబంధం" ప్రేక్షకులను అద్భుతమైన విజువల్ ప్రపంచంలోకి తీసుకెళ్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. కథ, సాంకేతిక నైపుణ్యం, విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండ్ సెట్స్, అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని పేర్కొన్నారు. భారీ అంచనాల నడుమ రూపొందిన "నాగబంధం" చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి చర్చనీయాంశంగా మారిన ఈ సినిమా విడుదల అనంతరం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది.



## మాదకద్రవ్యాల నిర్మూలనకు కదిలిన ఎన్‌సీసీ క్యాడెట్లు

**కేయూలో అవగాహన ర్యాలీ, మానవహారంతో యువతకు చైతన్యం**



**కేయూసీ, జూన్ 24 (జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై యువతలో చైతన్యం కల్పించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కేయూసీఈటీ) ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయ పోలీస్ స్టేషన్ (కేయూసీ) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ కేయూసీఈటీ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమై, విశ్వవిద్యాలయం మొదటి గేట్ మీదుగా పెగడపల్లి డబ్బాల వరకు సాగి తిరిగి మొదటి గేట్ వద్ద ముగిసింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి", "మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి", "ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోండి" వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విశ్వవిద్యాలయం మొదటి గేట్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా చాటిచెప్పారు. ఈ సందర్భంగా కేయూసీ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్. రవి కుమార్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి భవిష్యత్తును, కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. కేయూసీఈటీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డా. కె. విజయ్ కుమార్, డా. బి. అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు డా. డి. శైలజ, ఎం. సౌజన్య, కేయూసీ పోలీస్ స్టేషన్ సిబ్బంది విజయ్, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు ఇ. నరసింహన్




**వరంగల్, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చారిత్రాత్మక, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు ఇ. నరసింహన్ బుధవారం సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. నరసింహన్ వెంట రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రాము, డిప్యూటీ డైరెక్టర్లు సునయన చౌహాన్, పరుశరాములు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముందుగా ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం వారు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహా ఆశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయక ఆడిట్ అధికారులు సురేందర్ రెడ్డి, రవిప్రసాద్, రమేష్, ఆరిఫ్‌తో పాటు సీనియర్ ఆడిటర్లు సుమన్ రావు, అశోక్, కిషోర్, నాగరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న అధికారులు రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.



జై భీమ్
Jai Bheem
POWER OF PEOPLE

# జాతీయ యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ చాటిన కేయూ విద్యార్థిని సంధ్యారెడ్డి



**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎం.ఎస్సీ బయోటెక్నాలజీ 9వ సెమిస్టర్ విద్యార్థిని బారెడ్డి సంధ్యారెడ్డి జాతీయ యూత్ పార్లమెంట్‌లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. 2026 జూన్ 15 నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన జాతీయ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన యువ పార్లమెంట్, యూత్ ఫెస్టివల్, బడ్జెట్ క్వెస్ట్--2026 పోటీల్లో పలుమార్లు విజేతగా నిలిచిన సంధ్యారెడ్డి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జాతీయ యువ పార్లమెంట్‌లో "నారీ శక్తి వందన్" అంశంపై ఆమె చేసిన ప్రసంగం విశేష ప్రశంసలు అందుకుంది. మహిళా సాధికారత ప్రాధాన్యతను వివరించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని జాతీయ వేదికపై ప్రతిబింబిస్తూ సంధ్యారెడ్డి చేసిన ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంధ్యారెడ్డిని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆచార్య మామిడాల ఇస్తారి, యూత్ అఫైర్స్ అధికారి డా. టి. రాధిక అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక, జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించుకుని ఉన్నత వేదికలపై ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

## హనుమకొండ జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

ఎంపీ డా. కడియం కావ్యకు వివరాలు అందజేసిన డీఎంహెచ్‌వో డా. ఎస్.డి. రాంకుమార్






**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. ఎస్.డి. రాంకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలో ప్రజారోగ్య సేవల పరిస్థితి, అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్‌ఓ వివరించారు. జిల్లాలో అన్ని ఆరోగ్య సూచికల్లో మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో ముందంజలో నిలిచేలా కృషి చేయాలని ఎంపీ డా. కడియం కావ్య సూచించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. జాతీయ అంటురోగేతర వ్యాధుల నియంత్రణ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి ప్రజలకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతిపాదిత ఆరోగ్య ఉపకేంద్ర భవనాల కోసం స్థల సేకరణ, నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను డీఎంహెచ్‌వో డా. ఎస్.డి. రాంకుమార్ ఎంపీకి వివరించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల వరకు మెరుగైన వైద్య సేవలు విస్తరించే దిశగా ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ 5వ, 6వ సెమిస్టర్ ఫలితాల విడుదల



**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026 మే నెలలో నిర్వహించిన డిగ్రీ 5వ, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ సెమిస్టర్‌లో 41.33 శాతం, 6వ సెమిస్టర్‌లో 48.54 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. విద్యార్థులు తమ ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని సూచించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా. పి. వెంకటయ్య, డా. తిరుమలదేవి, డా. బి. నాగరాజు, డా. అసీం ఇక్బాల్, డా. పి. శ్రీనివాస్, డా. పద్మజ, సహాయ రిజిస్ట్రార్ రామా వెంకటేశ్వర్లు, క్యాంపు ఆఫీసర్ నాయకపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


## ఒంటరి దివ్యాంగురాలిపై అత్యాచారం

దుండగుడి కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్,జూన్24(జై భీమ్ న్యూస్) :**

నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినికిడి శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు

## తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వార్షిక సదస్సుకు కేయూ సిద్ధం




**హన్మకొండ, 24 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జూన్ 25న తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) 7వ వార్షిక సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు కార్యదర్శి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య పి. వరలక్ష్మి తెలిపారు. సదస్సు ప్రారంభ సమావేశం ఉదయం జరగనుండగా, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరవుతారు. గౌరవ అతిథులుగా డీన్ ఆచార్య రాజేందర్ కట్ల, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహాచారి పాల్గొంటారు. ప్రత్యేక అతిథులుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆచార్య ఎస్. శ్రీనివాసమూర్తి, టీసీఏ వ్యవస్థాపక పరిరక్షకుడు ఆచార్య పి. పురుషోత్తంరావు, అధ్యక్షుడు ఆచార్య డి. చిన్నప్ప, ప్రధాన కార్యదర్శి ఆచార్య జాస్తి రవికుమార్ హాజరుకానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించే ముగింపు సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఘనశ్యామ్ సోలంకి విశిష్ట అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహాచారి, ఆచార్య పి. అమరావేణి, టీసీఏ కోశాధికారి డాక్టర్ కె. రఘువీర్ కూడా పాల్గొంటారు. ఈ సదస్సుకు డాక్టర్ ఫణీంద్ర కుమార్ కన్వీనర్‌గా, డాక్టర్ బి. ప్రగతి కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నట్లు ఆచార్య పి. వరలక్ష్మి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని కామర్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కలెక్టర్‌కు వినతి - ఒంటేరు చక్రి

**హనుమకొండ, 24 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని విద్యార్థి, ప్రజా, తల్లిదండ్రుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు ఒంటేరు చక్రి మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ఆర్థిక పరిస్థితుల కారణంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం కాకూడదన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న భారీ ఫీజులు పేద కుటుంబాలకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, అందువల్ల ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఫీజుల నియంత్రణకు చట్టబద్ధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఇసంపెల్లి సంజీవ్, స్వేరోస్ నాయకులు డుడపాక నరేష్, తల్లిదండ్రుల సంఘం నాయకులు పుష్ప బిక్షపతి, స్వేరోస్ నాయకులు ప్రదీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం




**కాజీపేట, 24 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట చౌరస్తాలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ముందు ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నెల 22వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎదుట ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానిక వ్యాపారి పూజారి రమేష్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కాజీపేట పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 160/2026 కింద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో మృతుడు సరైన ఆహారం, తాగునీరు అందక అనారోగ్యానికి గురై మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, ఎత్తు 5 అడుగులు, చామనచాయ రంగు, పలుచటి నల్లటి గడ్డం ఉన్నట్లు గుర్తించారు. అతను నలుపు గీతలు ఉన్న మాసిన తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గుర్తింపునకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నామని, పై ఆనవాళ్లు గల వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలిసి ఉంటే వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్‌ను లేదా 8712685122, 8712685008 నంబర్లను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీ అరికట్టాలి

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కలెక్టర్‌కు వినతి
డిమాండ్ చేసిన ఒంటేరు చక్రి

**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని విద్యార్థి, ప్రజా, తల్లిదండ్రుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు ఒంటేరు చక్రి మాట్లాడుతూ, ప్రైవేటు మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక హక్కు అని, కానీ ప్రస్తుతం కార్పొరేట్ స్థాయి విద్య పేదలకు అందని ద్రాక్షగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని, ఆ విద్య అందరికీ సమానంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ విధించే చట్టాన్ని తీసుకువచ్చి, విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు ఇసంపెల్లి సంజీవ్, స్వేరోస్ నాయకులు డుడపాక నరేష్, ప్రదీప్, ప్రవీణ్, తల్లిదండ్రుల సంఘం నాయకుడు పుష్ప బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# నూతన ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన పోలీస్ కమిషనర్





**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కుటుంబ వివాదాల పరిష్కారానికి మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం కోసం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబేదారి పోలీస్ స్టేషన్ ఆవరణలోని మహిళా పోలీస్ స్టేషన్--1ను సందర్శించిన కమిషనర్, అక్కడ ఏర్పాటు చేయనున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. కేంద్రం నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, కార్యాలయ ఏర్పాట్లు, బాధితులకు అందించాల్సిన సేవలు, కౌన్సిలింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం వరంగల్ రంగంపేటలోని మహిళా పోలీస్ స్టేషన్--2లో ప్రస్తుతం కొనసాగుతున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, కేంద్రం పనితీరును సమీక్షించారు. అక్కడ పరిష్కారమైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కౌన్సిలింగ్ విధానం, నిర్వహిస్తున్న రికార్డులు, నమోదు పుస్తకాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలతో వచ్చే బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా కౌన్సిలింగ్ కేంద్రాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. అలాగే కౌన్సిలర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, బాధ్యతలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, మహిళా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, సూర్యప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత, సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, సర్వోదయ కార్యదర్శి డా. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# బైరాన్‌పల్లిలో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభోత్సవం





**హసన్‌పర్తి, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసిన ప్రీ-ప్రైమరీ తరగతులను హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని బైరాన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లెబోయిన సురేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బాల్య దశ నుంచే నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రీ-ప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దండ్రే రవికుమార్, గ్రామ ఉపసర్పంచ్ కల్లెబోయిన శ్రీకాంత్, గూడెంపాడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డా. బండి రజని కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కల్లెబోయిన మమత, వార్డు సభ్యురాలు ప్రవళిక పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు సంపత్, తిరుపతి రెడ్డి, సీఆర్‌పీ నాగరాజు, హేమలత, అర్చనతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచి విద్యాభివృద్ధికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి**

**నల్లగొండ,జూన్24(జై భీమ్ న్యూస్):**

శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈఓ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్ పాల్గొన్నారు.

## కేయూలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం నిర్వహణ



**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం డీన్, స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం, విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 25 (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో "ఇంటర్నేషనల్ డే ఎగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ -- 2026" కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీన్, స్టూడెంట్ అఫైర్స్ ఆచార్య మామిడాల ఇస్తారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి హాజరుకానున్నారు. వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సతీష్ ముఖ్య వక్తగా పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ రవాణా నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించనున్నారు. గౌరవ అతిథులుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యురాలు అనితా రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జె. కృష్ణవేణి పాల్గొననున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత పాత్ర కీలకమని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఆచార్య మామిడాల ఇస్తారి తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కేయూ బయోటెక్నాలజీ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా డా. టి. శాస్త్రి నియామకం

**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా విభాగ సహాయ ఆచార్యులు డా. టి. శాస్త్రిని రెండేళ్ల కాలానికి నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. నియామక ఉత్తర్వులను డా. టి. శాస్త్రి బుధవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం ఆయన ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు డా. పి. శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా డా. టి. శాస్త్రి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, బయోటెక్నాలజీ విభాగ విద్యా ప్రమాణాల పెంపు, ఆధునిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపకల్పన, పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. డా. టి. శాస్త్రి నియామకాన్ని పురస్కరించుకుని బయోటెక్నాలజీ విభాగ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో విభాగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



# కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**కేసముద్రం, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కాట్రపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా 150 నోట్‌బుక్స్, 20 పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విద్యను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పైలట్ ప్రాజెక్టుల పేరుతో కొద్ది పాఠశాలలకే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఈ విధానాన్ని విస్తరించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలంటే గ్రామస్తులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య, గడ్డం బాలకృష్ణ, గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం, పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంపై ఆందోళన**

**తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**



**వరంగల్, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, పోషకాహార కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. పిల్లల హాజరు, విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీఎస్ తెట్టేకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడుకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారిణి నిర్మలకు సూచించారు. ప్రజలకు తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఆర్డీవో సుమ, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట

**షరతులతో కూడా బెయిల్ మంజూరు**

**హైదరాబాద్,జూన్24(జై భీమ్ న్యూస్):**

సింగరేణి సంస్థ మరియు దాని యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలనే నిబంధనపై బెయిల్ లభించింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ భయం లేకుండా ఈ బెయిల్ నిర్ణయం ఆయనకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.

# ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధ్యయన కేంద్రం (స్టడీ సర్కిల్), బంజారాహిల్స్, హైదరాబాద్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్ఏటీ)--2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ వర్గాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండటంతో పాటు కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 19 నుంచి జూలై 12 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో కూడిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అత్యున్నత స్థాయి ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సివిల్ సర్వీసెస్‌లో రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డా. కె. జగన్ మోహన్, పర్యాటక అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఎం. శివాజీ, కనకరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవపురలో యోగి ఆదిత్యనాథ్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన గ్లోబల్ గ్రోత్ డైలాగ్ 2026 కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన బిజెపి నేత ఉత్తర ప్రదేశ్ ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రి  యోగి ఆదిత్యనాథ్ కి మారతహళ్లిలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మహాదేవపుర నియోజకవర్గ  ఎమ్మెల్యే శ్రీమతి మంజుల లింబావళి గారు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి  నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు భూసేకరణ

**భూములను పరిశీలించిన పరిగి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు**

**వికారాబాద్,జూన్24(జై భీమ్ న్యూస్):**


రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక ముందడుగు పడింది. ఈ పథకంలో భాగంగా నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సయ్యద్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి భూసేకరణ, సర్వే ప్రక్రియ, ముంపు ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం దాదాపు 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు తేల్చారు. ఈ మేరకు భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముమ్మరంగా కసరత్తు చేయనున్నారు. 2.80 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక భాగంగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణలోని దాదాపు 4.97 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందనుంది. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించనుంది.? రిజర్వాయర్ నిర్మాణంతో పరిగి, వికారాబాద్, తాండూరు రైతుల పొలాలు సస్యశ్యామలం అవుతాయని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం

**అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : మంత్రి కొండా సురేఖ**
**ఉత్సవాల నిర్వహణకు రూ.20 కోట్ల నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

**హైద్రాబాద్, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గతంలో ఒకే కార్పొరేషన్ పరిధిలో బోనాల ఉత్సవాలు నిర్వహించగా, ఈసారి హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మూడు కార్పొరేషన్లలో మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న మంత్రి కొండా సురేఖ బుధవారం జూమ్ వేదికగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల భక్తి, ప్రజల సామూహిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా కొనసాగనున్నాయని మంత్రి తెలిపారు. ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటుతాయని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ, జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, రోడ్లు-భవనాల శాఖ, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, పర్యాటక, సమాచార పౌరసంబంధాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, తాగునీటి సదుపాయాలు, క్యూలైన్లు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలను వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున రవాణా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. అదనపు బస్సులు నడపడమే కాకుండా వృద్ధులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. లాక్టేషన్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయ శాఖ, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమన్వయ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డీజీపీ సి.వి. ఆనంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# జీడబ్ల్యూఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హన్మకొండ, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా నిరంతరంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జీడబ్ల్యూఎంసీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధాన నాలాలు మరియు ఉప డ్రైనేజీల పూడికతీత పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, టెండర్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రధాన, ఉప డ్రైనేజీల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా కమర్షియల్, గృహ నల్లా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత సమయంలో కనెక్షన్లు మంజూరు చేయాలని సూచించారు. నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నగరాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, మాధవి, సంజయ్, డీఈలు, ఏఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

**రేషన్ నిరాకరణపై సుప్రీం ఆశ్చర్యం**

**న్యూఢిల్లీ,జూన్24(జై భీమ్ న్యూస్):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ  నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.





# డ్రగ్స్‌కు దూరంగా ఉండి జీవితాన్ని గెలుచుకోవాలి

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం: ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్**

**హసన్‌పర్తి, 24 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

యువత మరియు విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా, వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం హసన్‌పర్తి మండలంలోని నాగారం రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈగిల్ ఫోర్స్ తెలంగాణ' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, ఎస్సై గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయని అన్నారు. కొంతమంది చెడు స్నేహాలు, తప్పుడు అలవాట్ల ప్రభావంతో మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్నారని, ఒకసారి డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్యం, చదువు, కుటుంబం, సమాజంలో గౌరవం అన్నీ కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు కేవలం వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా నాశనం చేసే మహమ్మారిగా మారాయని పేర్కొన్నారు. డ్రగ్స్ కారణంగా శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతింటుందని, అనేక మంది యువత తమ లక్ష్యాలను కోల్పోతున్నారని తెలిపారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక యాంటీ డ్రగ్ సైనికుడిలా పనిచేస్తేనే డ్రగ్స్ రహిత తెలంగాణ సాధ్యమవుతుందని అన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎక్కడైనా తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా వాట్సాప్ నంబర్ 8712685015 కు సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, సమాజాన్ని రక్షించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులందరితో కలిసి "సే నో టు డ్రగ్స్ -- సే ఎస్ టు లైఫ్ " అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, కృషి, మంచి అలవాట్లు అవసరమని, డ్రగ్స్ వంటి దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆసక్తిగా తెలుసుకొని పలు ప్రశ్నలు అడగగా పోలీసులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, ఈగిల్ ఫోర్స్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# రైతుబంధు విషయంలో మరోసారి దగా

**కుసుమ్ పథకంలో వేయికోట్ల మోసం**

**సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి**

**హైదరాబాద్,జూన్24(జై భీమ్ న్యూస్) :**

రైతుబంధు విషయంలో మరోసారి మోసం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపై విరుచుకుపడ్డారు. వానా కాలం రైతుబంధు వేస్తామని కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. యాసంగి మీ తాత ఇస్తాడా? అంటూ చురకలు అంటించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన రైతు బంధును సక్కగా ఇచ్చినా కూడా రూ.30 వేల కోట్లు ఇంకా తెలంగాణ రైతులకి బాకీ ఉన్నావని విమర్శించారు. తెలంగాణ రైతులు రేవంత్ రెడ్డి మోసాలను గమనించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సర్ కార్యక్రమం మునిగిన తరువాత ఎన్నికలకు వెళ్లనున్న దృష్ట్యా వానాకాలం రైతు బంధు వేస్తామని నాటకాలాడుతున్నారని, వానాకాలం, యాసంగి కాలం ఇవ్వాల్సిన బాకీని ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బ్యాంకును కూడా బ్లాక్ మెయిల్ చేసే మొనగాడని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలను పక్కనబెట్టేసిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీంలు లేవని విమర్శిస్తూ.. ముఖ్యంగా 'కుసుమ్' పథకంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో కొందరు పెద్దల పేర్లు వినపడుతున్నాయని, దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై స్పందిస్తూ.. పీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మెట్రో ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి తిప్పికొట్టారు. నిజానికి మెట్రో విషయంలో బీజేపీ , 'హైబ్రిడ్ కాంగ్రెస్' ఒక్కటయ్యాయనే విషయం స్పష్టంగా తేలిపోయిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీతో జట్టు కట్టారని విమర్శించారు. చంద్రబాబు, మోదీ ఆలోచనల నుండి పుట్టిన ఒక క్రాస్ బ్రీడ్, హైబ్రిడ్ సీఎం ప్రస్తుతం రాష్ట్ర పాలన సాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ, జాతీయ బ్యాంకులను భయపెడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయబట్టే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా ఇతర కేంద్ర మంత్రులతో రేవంత్‌కు సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని అన్నారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి పీఏ లాగా పని చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలకు ప్రభుత్వం ఎందుకు అంతలా భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణలో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయడంపై జగదీష్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలోనే కాదు, దేశంలో ఎక్కడైనా తమ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఇందులో కొత్తగా ఆఫీస్ పెట్టడం ఏముందని, ఆయన ఎప్పటి నుంచో ఇక్కడే ఉన్నారు కదా అని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ వచ్చినందుకు నిరసనగా 11 రోజులు అన్నం తినకుండా పవన్ కళ్యాణ్ చేసిన దీక్ష కూడా తెలంగాణలోనే జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడి తిండితోనే వాళ్ల శరీరం నిర్మాణం అయిందని వ్యాఖ్యానించారు. చివరగా.. పవన్ కళ్యాణ్, మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. వీరందరూ ఒకే కూటమిగా, ఒక్కటిగానే పనిచేస్తున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

# హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

**కిటికీ నుంచి శిశువు బయటకు విసిరివేత**

**యువతిని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది**

**హైదరాబాద్,జూన్24(జై భీమ్ న్యూస్) :**

గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడిపోవడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనలో మరో ముఖ్యమైన అంశం యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బందికి తెలియకపోవడం. హాస్టల్‌లోనే ఉంటున్న విద్యార్థిని గర్భవతి అయినప్పటికీ ఎవరూ గుర్తించలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీనిపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా యువతి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ప్రజల సమస్యలే ప్రాధాన్యం

**గంటన్నరపాటు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'**

**ప్రజలతో మంత్రి పార్థసారథి ప్రత్యక్ష సంభాషణ**

**కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 4.51 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి**

**ఆధిపత్య రాజకీయాలు, అరాచకాలు, విధ్వంసక చర్యలను సహించబోం**

**నూజివీడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి.**

**విజయవాడ,జూన్24(జై భీమ్ న్యూస్):**


రాష్ట్రంలోనే నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, రైతుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.విజయవాడ రూరల్ తాడిగడప 100 ఫీట్ రోడ్డులో ఉన్న సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలోని ప్రజలతో పలు కీలక అంశాలపై మంత్రి పార్థసారథి బుధవారం ఉదయం మాట్లాడారు. ప్రజల సమస్యలే ప్రాధాన్యం... గంటన్నరపాటు 'డయల్ యువర్ ఎమ్మెల్యే' లో ప్రజలతో మంత్రి పార్థసారథి ప్రత్యక్ష సంభాషణ..నూజివీడు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో మంత్రి కొలుసు పార్థసారథి నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దాదాపు రెండు గంటల పాటు వందలాది మంది ప్రజలతో ఫోన్ ద్వారా మాట్లాడిన మంత్రి, ప్రతి ఒక్కరి సమస్యను ఎంతో ఓర్పుగా ఆలకిస్తూ, వారికి తగిన భరోసా కల్పించారు.కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, మంచినీటి సమస్యలు, వ్యక్తిగత భూముల వివాదాలు, వయోవృద్ధుల పెన్షన్ల మంజూరు వంటి సమస్యలతోపాటు విద్యార్థులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వారి మొబైల్ నంబర్లు తీసుకుని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న మంత్రి, ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు నా వంతు కృషి చేస్తాను అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు.కార్యక్రమం కొనసాగుతున్నంతసేపూ నిరంతరం ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. వందలాది మందితో మాట్లాడిన తర్వాత కూడా కాల్స్ వస్తూనే ఉన్నప్పటికీ, మంత్రి ఏమాత్రం విసుగు చెందకుండా ప్రజలతో మాట్లాడి, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తూ, పరిష్కార ప్రక్రియను అక్కడికక్కడే ప్రారంభించారు. ప్రజలు కూడా నియోజకవర్గంలో మంత్రి పనితీరును ప్రశంసించడం అభినందనీయంగా చెప్పుకోవచ్చు.నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రింగ్ రోడ్డు (బైపాస్) నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పరిష్కార చర్యలు చేపడుతోందన్నారు. మామిడికాయల రక్షణ కోసం కవర్ల పంపిణీ, పంట బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నూజివీడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆధిపత్య రాజకీయాలు, అరాచకాలు, విధ్వంసక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను తప్పుదోవ పట్టించడం, నేరాలకు ప్రోత్సాహం ఇవ్వడం సమాజానికి హానికరమని అన్నారు. రాజకీయాలు యువతను అభివృద్ధి, సేవా దృక్పథం వైపు నడిపించాలని సూచించారు.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం నివాసయోగ్యం కాని ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాలు, కొండలు, స్మశానాలు, చెరువుల పరిసరాల్లో కూడా ఇళ్ల స్థలాలు కేటాయించడం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. పేదలకు కేటాయించే గృహ స్థలాలు వారి ఉపాధికి అనుకూలంగా, మౌలిక సదుపాయాలు కలిగిన ప్రాంతాల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం గతంలో కేటాయించిన లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 4.51 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మరో 4 లక్షల పీఎంఏవై (అర్బన్) ఇళ్లను పూర్తి చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదేవిధంగా ఖఓంజ-జ 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని, కొత్తగా వచ్చిన సుమారు 10 లక్షల దరఖాస్తుల్లో 8 నుంచి 9 లక్షల మంది అర్హులను గుర్తించామని, వారికి కూడా త్వరలో ఇళ్లను మంజూరు చేసే చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీల మధ్య పూర్తి సమన్వయం ఉందని, నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాల విషయంలో అంగీకరించిన విధానాన్నే పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా చిన్నపాటి లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

**దుష్ప్రచారాన్ని నమ్మవద్దు : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**అమరావతి,జూన్ 24 (ఆర్ఎన్ఎ) :**

సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను అన్నారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా తమకు లేదని అన్నారు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5వేల భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు, పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదని, నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే అని స్పష్టం చేసారు. సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని స్పష్టం చేసారు. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదని అన్నారు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం కూటమి ప్రభుత్వం, దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు.




# విధి నిర్వహణలో మరింత జవాబుదారీతనం పెరగాలి

**ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్**

**ఏలూరు, జూన్ 24 (ఆర్ఎన్ఐ):**

ప్రభుత్వ అధికారులు, సిబ్బందిలో విధి నిర్వహణలో మరింత జవాబుదారీతనం పెరగాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జేసీ ఎం.జె. అభిషేక్ గౌడ, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు, ప్రస్తుత సమస్యలపై ఎంపీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాల స్థాయి ని మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. ప్రజల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం తన వద్దకు వచ్చిన ప్రజల అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరుగుతున్నదని, వాటిపై కొన్ని శాఖల అధికారులు ఎటువంటి చర్య తీసుకోకపోవడమే కాకుండా కనీసం జవాబు కూడా ఇవ్వడం లేదని, ఇది చాలా విచారించదగిన విషయమన్నారు. తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే గ్రామాలలో నిరక్షరాస్యులు, పేదలకు ఎటువంటి సేవలందుతున్నాయో ఊహించుకోవచ్చన్నారు. ఇకనుండి ఇటువంటి పద్ధతి ఖచ్చితంగా మారాలని, ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అప్పుడే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. అధికారులు ఆ దిశగా పనిచేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, ప్రజల సమస్యలపై అధికారులు, సిబ్బంది బాధ్యతతో స్పందించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనల సమయంలో ఎయిర్పోర్ట్ మాదిరిగా ఆధునీకరిస్తామంటూ చూపించిన 3డి చిత్రాలకు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు అసలు సంబంధం లేదన్నారు. మొదటి దశలో 12 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు నాసిరకం మెటీరియల్ వినియోగించారని , ఎయిర్పోర్ట్ లాగా కాదు ఒక గెస్ట్ హౌస్ మాదిరిగా మాత్రమే ఉందన్నారు. బుకింగ్ కౌంటర్లు, వసతి, ప్రయాణీకుల విశ్రాంతి గదులు, టాయిలెట్లు, వంటి వాటిని అస్సలు పట్టించుకోలేదని, పాత వాటినే తూతూ మంత్రంగా మెరుగులు దిద్ది కొనసాగిస్తున్నారన్నారు. రానున్న 20 సంవత్సరాల అవసరాలకు సరిపోయే విధంగా ఏలూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ఉండేలా చేపట్టాలని, అవసరమైతే ప్రతిపాదనలు సవరించి సమర్పించి, పనులు పూర్తి నాణ్యతతో చేపట్టి, కొత్త స్టేషన్ మాదిరిగా రూపొందించాలన్నారు. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు సక్రమంగా చేపట్టకపోతే విజిలెన్స్ విచారణ చేయిస్తానని ఎంపీ హెచ్చరించారు. జిల్లాలో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ల నిర్మాణ పనులు 6 నెలల నుండి ఎటువంటి పురోగతి లేదని రైల్వే అధికారులపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులతో సమన్వయము చేసుకుని రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని రైల్వే అధికారులను ఎంపీ ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టే పనులు ఏ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులను అదే సంవత్సరంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రణాళికా శాఖాధికారులను ఎంపీ ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు జిల్లాలో రహదారి భవనాల శాఖ ద్వారా 314 కోట్ల రూపాయలతో 72 పనులకు ప్రతిపాదనలు సమర్పించామని, అదేవిధంగా 274 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు 193 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సమర్పించామని అధికారులు తెలియజేయగా గోదావరి పుష్కరాలకు పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాలలో నిర్మించాల్సిన రోడ్ల నిర్మాణ పనులకు త్వరితగతిన మంజూరు తీసుకుని పనులు ప్రారంభించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి కైకలూరు బైపాస్ రోడ్డు పనులు డిసెంబర్ లోగా పూర్తిఅయ్యేలా చూడాలన్నారు. ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ల్యాబ్ ను జంగారెడ్డిగూడెం తరలించకుండా ఏలూరు ఆసుపత్రిలోనే కొనసాగించాలని, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ల్యాబ్ పరికరాల మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన సేవలందించేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఏలూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఉంగుటూరు, కైకలూరు, తదితర మండలాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీ ఆదేశించారు. ఏలూరులో బిసి వసతి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులను ఎంపీ ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కోరిన వారికి జాబ్ కార్డులు అందించి పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు నుండి అందిన ప్రతిపాదనలకు ప్రాధాన్యతను ఇచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# 'ధురంధర్' ఒక ఫెనామినల్ ఫిల్మ్.. దేశాన్ని ఏకం చేసింది: రామ్ చరణ్





**రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' ఫ్రాంచైజీపై రామ్ చరణ్ ప్రశంసల వర్షం**

**ఆ సినిమా ఒక అద్భుతమని, దేశాన్ని ఏకం చేసిందని వ్యాఖ్య**

**రిపబ్లిక్ సమ్మిట్‌లో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన చరణ్**

**రూ.1800 కోట్లకు పైగా వసూళ్లు ప్రజల ఆమోదానికి నిదర్శనమని వెల్లడి**

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఫ్రాంచైజీపై గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల రిపబ్లిక్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన, ఈ సినిమాను ఒక ఫెనామినల్ చిత్రంగా అభివర్ణించారు. తాను ఈ చిత్రాన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో చూశానని, సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ.. "ఇది ఒక అద్భుతమైన, అసాధారణమైన సినిమా. సరైన వేగంతో, అన్ని అంశాలు చక్కగా కుదిరాయి. జాతీయ సమగ్రత, దేశమే ప్రథమం అనే భావన మన సినిమాలకు చాలా ముఖ్యం. ఈ సినిమా దేశాన్ని ఏకం చేసింది. ఇలాంటి మరిన్ని చిత్రాలు రావాలి" అని అన్నారు. ఈ ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సాధించిన భారీ విజయంపైనా చరణ్ స్పందించారు. "ఈ సినిమా రూ.1800 కోట్లకు పైగా వసూలు చేసి అత్యధిక గ్రాసర్‌గా నిలిచింది. బాక్సాఫీస్ నంబర్ అంటే ప్రజలు దానిని ఎంతగా అంగీకరించారనే దానికి నిదర్శనం. థియేటర్లకు వచ్చిన ప్రేక్షకుల సంఖ్యే ముఖ్యం. ఇది మన దేశానికి మేలు చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన 'ధురంధర్' 2025 డిసెంబర్‌లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.1300 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. దీనికి సీక్వెల్‌గా ఈ ఏడాది మార్చిలో వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' రూ.1800 కోట్లను అధిగమించి, 'దంగల్' తర్వాత అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు నెట్‌ఫ్లిక్స్, జియోహాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి.

# ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!

**భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న హాలీవుడ్ హారర్ చిత్రం 'అబ్సెషన్'**


**కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం**

**భారత్ లో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు**

**ఈ ఏడాది ఇండియాలో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచిన సినిమా**

భారత్‌లో వచ్చిన స్పందన చూసి షాక్ అయ్యానన్న 26 ఏళ్ల దర్శకుడు

హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల కర్రీ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది. కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది. ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల కర్రీ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.






# హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది: సౌత్ ఇండస్ట్రీపై తమన్నా సంచలన వ్యాఖ్యలు!

**సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా ఉంటుందన్న తమన్నా**

**హీరోయిన్లను గ్లామర్ బొమ్మలుగా చూపించడం తనకు నచ్చదని వ్యాఖ్య**

**గ్లామర్, నటన ఉన్నవాళ్లే సూపర్ స్టార్లు అవుతారన్న మిల్కీ బ్యూటీ**

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది. భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సౌత్ ఇండస్ట్రీలో కూడా తానే కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.